సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



నీళ్ల కోసం ఆందోళన

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలో మహిళలు నీళ్ల కోసం సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని 4, 5 వార్డుల్లో రెండేళ్ల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్వితే పాతపైప్‌లైన్లు పగిలిపోయాయని.. వాటిని మరమ్మతులు చేయక అలాగే వదిలేశారన్నారు. అటు మిషన్‌భగీరథ నీళ్లు రాక.. ఇటు పాతపైపులైన్ పగిలిపోయి నీటి కోసం ఇబ్బంది పడుతున్నామన్నారు.

అసెంబ్లీ ఆట మొదలు

- ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో వేడెక్కిన రాజకీయం
- ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- ఇంకా ఒక్క సీటూ ప్రకటించని ప్రతిపక్షాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అమల్లోకి కోడ్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సైరన్ మోగిస్తూ ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చింది. ఇక నుంచి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమావేశాలు జరుపరాదు. ఆన్ గోయింగ్ స్కీంలను కొనసాగించవచ్చు. ఎన్నికల తంతు అధికారికంగా ప్రారంభం కావడంతో పల్లెల్లో, పట్టణాల్లో ప్రచార పర్వం మొదలు కానుంది. ఇప్పటికే అధికార పార్టీ బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం ప్రారంభించింది. నెల రోజుల కిందే అభ్యర్థులను ప్రకటించడంతో 10 రోజులుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో తమను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బీసీ చేయూత పథకం, గృహలక్ష్మి, మైనారిటీ, క్రిస్టియన్ బంధు పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందించే కార్యక్రమాలను ముమ్మరం చేశారు. పెండింగ్ పనుల పూర్తి, హామీలతో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించి, పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపారు.

అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ

శాసనసభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అధికార పార్టీని ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటివరకు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. పార్టీలపై ప్రజల్లో సానుభూతి ఉన్నా అనుకూలంగా మలుచుకోవడంలో విఫలమవుతున్నారన్న భావన ఉంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరించినా ఖరారు చేయలేదు. ఢిల్లీ, హైదరాబాద్ స్థాయిలో టికెట్లను ఆశిస్తున్న నేతలు పైరవీల్లో మునిగిపోయి, అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మిగతా పార్టీల విషయానికొస్తే.. బహుజన్ సమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లాలో నాలుగు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. జనసేన పార్టీ ఐదు సీట్లలో పోటీ చేస్తామని నియోజకవర్గాల పేర్లను ప్రకటించిందే తప్ప అభ్యర్థులను వెల్లడించలేదు.

3.2 లక్షలు పెరిగిన ఓటర్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12, 283 మంది ఓటర్లు ఉన్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా ఆ సంఖ్య 31.12 లక్షలు దాటింది. మొత్తంగా చూసినప్పుడు ఐదేళ్ల క్రితానికి ఇప్పటికి 3,24,198 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో యువతే ఎక్కువ మంది ఉన్న నేపథ్యంలో దాదాపు అన్ని పార్టీలు వారిని లక్ష్యంగా చేసుకొని, మేనిఫెస్టో, ప్రచారానికి రూపకల్పన చేస్తున్నాయి.

ఎన్నికల షెడ్యూల్ ఇదే..

- నోటిఫికేషన్ - నవంబర్ 3
- నామినేషన్లకు ఆఖరు తేదీ - నవంబర్ 10
- నామినేషన్ల పరిశీలన - నవంబర్ 13
- ఉపసంహరణకు ఆఖరు తేదీ - నవంబర్ 15
- పోలింగ్ తేదీ - నవంబర్ 30
- ఓట్ల లెక్కింపు - డిసెంబర్ 3

ఇవి చేయడానికి వీల్లేదు..

- కోడ్ అమల్లోకి వచ్చినందున మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక పర్యటనలు చేయరాదు.
- ప్రభుత్వ పథకాలు, ప్రచారాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది.
- ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే ప్రతీ అభ్యర్థి ఖర్చుపై నిఘా ఉంటుంది.
- కొత్త పథకాల ప్రకటన, మౌలిక సదుపాయాల కల్పనపై ఎలాంటి హామీలు ఇవ్వకూడదు. అధికారిక వాహనాల వినియోగంపై పరిమితులు ఉంటాయి.
- నగదు రవాణా విషయంలో బంగారం, వడ్డీ, బ్యాంకింగ్ అధికారులతోపాటు సామాన్యులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికీ కావాల్సిన ఇన్వాయిస్, బిల్లులు దగ్గర పెట్టుకోవాలి.
- లైసెన్స్‌డ్ ఆయుధాలన్నీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సరెండర్ చేయాలి. ప్రార్థనా స్థలాల వద్ద ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు.
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎలాంటి కానుకలు, డబ్బు, మద్యం పంచకూడదు.
- రాజకీయ విమర్శలు చేసే క్రమంలో వర్గాన్ని, నాయకుడిని ఉద్దేశిస్తూ.. విద్వేష వ్యాఖ్యలు చేయరాదు.
- ర్యాలీలు, సభల విషయంలో అధికా రుల అనుమతి తీసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



ఎన్నికల నిర్వహణపై మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- అమల్లోకి ఎన్నికల కోడ్
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా సహకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రెస్‌మీట్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌పై మాట్లాడారు. తక్షణమే జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని.. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పాటించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎన్నికల నియమావళి అమలుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1950 నంబర్, కంట్రోల్ రూమ్, ఎన్‌జీఆర్‌ఎస్, సీ–విజిల్ యాప్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆఫీసుల్లో పొలిటికల్ ఫొటోలు 24 గంటల్లో, ప్రభుత్వ స్థలాల్లోని రాజకీయ నాయకులు పోస్టర్లు, బ్యానర్లు, గోడలపై రాతలను 48 గంటల్లోగా తొలగించాలని ఆదేశాలున్నట్లు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంపీఎంసీ బృందాలను క్రియాశీలం చేసినట్లు తెలిపారు. నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

తప్పుడు మెస్సేజ్‌లు పంపొద్దు – ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్‌శాఖ కృషి చేస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం నుంచి జిల్లాలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ మెస్సేజ్‌లు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్ గ్రూపులలో ఫేక్ మెస్సేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే గ్రూప్ అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి

ఎన్నికలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కంట్రోల్ రూమ్ బాధ్యులకు కలెక్టర్ అనురాగ్‌జయంతి ఆదేశించారు. సీ–విజిల్‌లో వచ్చే మోడల్ కోడ్ కండక్ట్ ఉల్లంఘనలపై 100 నిమిషాల్లో తీసుకున్న చర్యలపై అప్‌లోడ్ చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారం కోసం సువిధలో చేసుకున్న దరఖాస్తులను టైంలోగా ప్రాసెస్ అయ్యేలా చూడాలన్నారు. ఫేక్‌న్యూస్‌లతో వ్యవస్థపై నమ్మకం పోకుండా చూడాలన్నారు.

రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్స్, జిల్లా వెబ్‌సైట్లలో రాజకీయాలకు సంబంధించిన ఫొటోలను తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలను సమర్పించాలన్నారు. నామినేషన్లలో అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ..అన్ని అంశాలు నింపారో లేదో చూడాలని నింపని పక్షంలో సదరు అభ్యర్థులకు రాత పూర్వకంగా సమాచారం అందించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, సీపీవో పి.బి.శ్రీనివాస్‌చారి, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, లేబర్ ఆఫీసర్ రఫీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సంక్షేమ రంగానికి పెద్దపీట



యువకులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అన్ని వర్గాలను అక్కున చేర్చుకుందని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. తన నివాసంలో సోమవారం మైనార్టీలకు కుట్టుమిషన్లు, యువకులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 62,126 మందికి రూ.812 కోట్లతో రైతుబంధు, 58,126 మందికి రూ. 782 కోట్ల పెన్షన్లు చెల్లింపు, 9,872 మంది ఆడబిడ్డలకు రూ.98 కోట్ల కల్యాణలక్ష్మీ చెక్కులు, రూ.170 కోట్లతో 4,800 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్, కోఆప్షన్ బాబూన్, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శరాములు, సర్పంచులు జిన్న అనిల్, గున్నాల అరుణ, వెలిశాల సంతోష్, ఎంపీటీసీ మల్లేశం, నాయకులు సలీం, అహ్మద్‌పాషా ఉన్నారు.

శ్రమిస్తే విజయం సాధ్యమే



జాతీయ పతాకావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న డీపీఆర్వో దశరథం

సిరిసిల్లకల్చరల్: పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధిస్తారని జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం పేర్కొన్నారు. నిత్యం జాతీయ పతాకావిష్కరణలో భాగంగా సోమవారం శివనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 75వ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. సామాన్యులకు సైతం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే అవకాశాన్ని కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కళాశాల రాష్ట్రంలోనే మొదటిదని, కళాశాల పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నాను అని పేర్కొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, అధ్యాపకులు దీటి దేవయ్య, వివేకానంద్, అరుందతి, ఆంజనేయులు, సురేశ్, రాజయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

హస్తకళతో మహిళలకు ఉపాధి



హస్తకళ నేర్చుకుంటున్న డిగ్రీ విద్యార్థినులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో విద్యార్థినుల కోసం సోమవారం నుంచి హస్తకళ నైపుణ్యంలో శిక్షణను ప్రారంభించారు. హస్తకళతో మహిళలకు ఉపాధి దొరుకుతుందని, బతుకు భరోసా లభిస్తుందని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. కాలేజీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం కన్వీనర్ వాణి, శిక్షకులు శ్వేత, జ్యోతి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ శ్రీవల్లి, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: డ్రాలో పేర్లు వచ్చిన అర్హులైన 112 మందికి అధికారులు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రాలో పేర్లు వచ్చిన వారికి నివేశన స్థలాలు ఇచ్చి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. పేర్లు రాని 850 మందికి నివేశన స్థలాలిస్తామని ప్రకటించి కేవలం 44 మందికి మాత్రమే ఇవ్వడం ఏంటని అధికారులను ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లోకి పలువురు నేతలు

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ ఇలాకాలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ నుంచి పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరడానికి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. గతంలో మూడుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన యెల్లె లక్ష్మీనారాయణతోపాటు ముఖ్య నాయకులు వైద్యశివప్రసాద్, మ్యాన ప్రసాద్, కోడం శ్రీనివాస్ హైదరాబాద్ వెళ్లారు. సిరిసిల్లకు చెందిన రాష్ట్రస్థాయి నాయకుడి తీరు, పార్టీలో తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న ఆవేదనతో వారు బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్లు తెలిసింది.

మరికొందరు అదేబాట?

జిల్లాలోని బీఆర్‌ఎస్‌లో జాతీయ స్థాయి పదవిలో ఉన్న ముఖ్యనేత ఆధ్వర్యంలో గత మున్సిపల్ ఎన్నికల సమయంలో చాలా మంది కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే తమకు పార్టీలో ప్రాధాన్యత దక్కడం లేదన్న ఆవేదనతో ఉన్నారు. మంత్రి కేటీఆర్‌పై ఉన్న అభిమానంతో ఇన్నాళ్లు బయట పడలేకుండా ఉంటున్నారు. ఇటీవల జరిగిన పలు పరిణామాలతో కలత చెందిన వారు కాంగ్రెస్‌లో చేరేందుకు మూడు రోజుల క్రితమే సిద్ధమయ్యారు. అయితే ఆ సమయంలో మంత్రి కేటీఆర్‌తో స్థానిక నాయకులు కలిపించగా నచ్చజెప్పినట్లు చర్చ సాగుతోంది. అంతలోనే సదరు నేతలు కాంగ్రెస్‌లో చేరడానికి వెళ్లడంపై సర్వత్ర చర్చ జరుగుతుంది. బీఆర్‌ఎస్‌లోని కొందరు బడా నేతల తీరుపై కిందిస్థాయి నేతలు గుర్రుగా ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటం.. పార్టీలో తమకు ప్రాధాన్యత లేకుండా ఉండడంతో కాంగ్రెస్ నేతల రాయభారం ఫలించింది. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌తో ఉన్న సత్సంబంధాలు ఫలించాయి. దీంతో వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు హైదరాబాద్ వెళ్లారు. అక్కడ పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరనున్నారు.

గంజాయి రవాణా చేస్తే పీడీయాక్ట్

- మత్తు పదార్థాల నిర్మూలనకు పటిష్ట చర్యలు
- గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు
- 4 కిలోల గంజాయి స్వాధీనం
- ఎస్పీ అఖిల్ మహాజన్



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

సిరిసిల్లఅర్బన్: గంజాయి రవాణా చేసిన, విక్రయించిన పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేశారు. వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఒడిశాకు చెందిన ప్రసంజిత్‌రాయ్ స్థానిక పాత బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకోగా.. అతని వద్ద ఉన్న బ్యాగులో 4 కిలోల గంజాయి లభించింది. కొద్ది రోజులుగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నానని నిందితుడు ఒప్పుకోగా.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే డయిల్ 100కు వివరాలు తెలపాలని కోరారు. ఈ సంవత్సరం జిల్లాలో 41 గంజాయి కేసులు నమోదు చేసి 83 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 32 కిలోల 204 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

జీవనోపాధి కల్పించండి

- మాజీ మావోయిస్టు జ్యోతక్క



ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తున్న జ్యోతక్క

సిరిసిల్లఅర్బన్: మావోయిస్టుగా ఉద్యమంలో దాదాపు ఇరువై ఏళ్లు పనిచేసి జనజీవన స్రవంతిలో కలిసిన తనకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క కలెక్టర్‌కు విన్నవించింది. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ఆమె ఈమేరకు వినతిపత్రం అందించింది. కోనరావుపేట మండలం శివాంగాలపల్లికి చెందిన తాను సీపీఐ మావోయిస్టు సంస్థలో జిల్లా కమిటీ సభ్యురాలితోపాటు వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల లొంగిపోయినట్లు తెలిపింది. జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవనం గడుపుతున్న తనకు జీవనోపాధి కోసం ఉద్యోగం ఇప్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కోరింది. అంతేకాకుండా పునరావస పథకం కింద బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.10 లక్షలు సబ్సిడీ రుణం మంజూరుచేయాలని కోరింది. సిరిసిల్లలో నివసించేందుకు ఇంటి స్థలాన్ని ఇప్పించాలని వేడుకుంది.

ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు

- సమస్యలు పరిష్కరించాలని బాధితుల మొర
- ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు మొరపెట్టుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై దృష్టి సారించాలన్నారు. అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అర్జీ తీసుకుంటున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలి



చిన్నబోనాలలో వడ్ల కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలి. స్థలం లేక సిరిసిల్ల రెండో బైపాస్‌లో ఆరబెట్టారు. ప్రస్తుతం బైపాస్ రోడ్డు ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామంలో నల్లెలగుట్ట వద్ద 10 ఎకరాల స్థలం ఉంది. ఆ స్థలాన్ని కొనుగోలు కేంద్రం నిర్వాహకులైన శ్రీసరస్వతీ మహిళా సమాఖ్య సంఘం సభ్యులకు మంజూరు చేయాలి. – కౌన్సిలర్ బొల్గం నాగరాజు, మహిళా సంఘం సభ్యులు

గూడు కల్పించండి




నా పేరు వంగ వెంకటలక్ష్మి. నేను, నా భర్త రాజీవ్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాం. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. వారికి పెళ్లిళ్లు అయ్యాయి. నా భర్త వృద్ధాప్యంతో నడవలేడు. డబుల్ బెడ్‌రూమ్ డ్రాలో పేరు వచ్చినప్పటికీ ఇల్లు ఇవ్వలేదు.
– వృద్ధ దంపతులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



వేములవాడ మండలం నాంపెల్లి శివారు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సర్వేనంబర్ 485, 486లో 19 ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. ఆ భూమి డబ్బులు కోర్టులో సివిల్ డిపాజిట్ చేసి నా లబ్ధిదారులు అనుభవిసున్నారు. దీనిపై ఆరు నెలల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్ల పట్టాలు ఇప్పించాలి. – చొక్కాల రాము, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ





వేములవాడ: రాజన్నను సోమవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు బెల్లం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరింది. టీఎస్ ఆర్టీసీ చైర్మన్ మిట్ట శ్రీనివాస్ రాజన్నను దర్శించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు కండువా కప్పి ప్రసాదాలు అందజేశారు. సిరిగిరి శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, పోసాని రాజు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు పనులకు భూమి పూజ



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం నుంచి గిద్దెచెరువు మీదుగా రాజన్నపేట, అల్మాస్పూర్ లింక్‌రోడ్డు వరకు మంజూరైన తారు రోడ్డు నిర్మాణానికి సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య భూమిపూజ చేశారు. ఈ రోడ్డును రూ.2.70కోట్లతో నిర్మించనున్నారు. తోట ఆగయ్య మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాజన్నపేట, గొల్లపల్లి శివారు రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సులభంగా ఉంటుందన్నారు. స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, నాయకులు బాలాగౌడ్, అందె సుభాష్, గుల్లపెల్లి నరసింహారెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు సత్కారం



సిరిసిల్లకల్చరల్: పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పేర్కొన్నారు. గ్రంథాలయంలో చదువుకుని కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువకులను సోమవారం సత్కరించారు. శంకరయ్య మాట్లాడుతూ శిక్షణ తీసుకోకుండా గ్రంథాలయంలోని వసతులు వినియోగించుకొని ఉద్యోగం సాధించారని కొనియాడారు. లైబ్రేరియన్ బి.శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పంచాయతీ వర్కర్ల సమ్మె విరమణ

సిరిసిల్లటౌన్: తమ సమస్యల సాధనకు నిరవధిక సమ్మె చేపట్టిన ఈ పంచాయతీ కార్మికులు సోమవారం విరమించారు. వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారులు సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బండి స్వామి, గడ్డం శేషాద్రి, నర్సింగోజు శ్రీధర్, శాణగొండ రమేశ్, శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌షో రద్దు

వేములవాడ: వేములవాడలో ఈనెల 10న నిర్వహించే మెగా డ్రోన్ షోను రద్దు చేస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో ఈ డ్రోన్‌షోను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

సిరిసిల్లఅర్బన్: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ పట్టణాధ్యక్షుడు సుంకపాక మనోజ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు అని ప్రచారం చేస్తుందని, ఎవరూ మోసపోవద్దని కోరారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌వై నాయకులు షాద్, మన్సూర్, వేణుగోపాల్‌యాదవ్, ప్రశాంత్, అమ్ము, ఇమ్రాన్, అషు, శ్రీనాథ్, సోను, అఫ్రోజ్, అజయ్ పాల్గొన్నారు.

ఆందోళనలు..నినాదాలు

- జిల్లా కేంద్రంలో మిన్నంటిన నిరసనలు
- కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం బీడి కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు నిరసనలకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడి కార్మికులు కలెక్టరేట్ ముందు ధర్నాలు చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడించారు.

మధ్యాహ్న కార్మికుల నిరసన

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, సీఐటీయూ ఆధ్వర్యంలో మరికొందరు కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేశారు. ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కడారి రాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి వేర్వేరుగా మాట్లాడుతూ.. ఇన్నేళ్లుగా వెట్టిచాకిరీకి గురవుతున్న వారికి ఆర్థికంగా.. ఉద్యోగపరంగా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మీస లక్ష్మణ్, ఎస్.లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, మోర అజయ్, ఎర్రవెల్లి నాగరాజు, మేకల కవిత, గొట్టె బాలమణి తదితరులున్నారు.

హమాలీ కార్మికుల నిరసన

వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఐకేపీ, సొసైటీ సెంటర్లలో కూలీ రూ.55 చెల్లించాలని, ప్రభుత్వమే ధర నిర్ణయించి కూలి ఇవ్వాలని కోరారు. ఎగమంటి ఎల్లారెడ్డి, సామనపల్లి రాములు, లోకుర్తి రాజు, పరుశురాములు పాల్గొన్నారు.

జీవనభృతి చెల్లించండి



కలెక్టరేట్ ముందు బీడీ కార్మికుల ధర్నా

ఆంక్షలు విధించకుండా బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులకు జీవనభృతి అందించాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో ధర్నాలో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. పనిదినాల తగ్గి ఉపాధి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీకార్మికులు, ప్యాకర్లు, బట్టీవాలా, అన్ని విభాగాల కార్మికులకు నెలకు రూ.2,016 ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ నాయకులు నరేందర్, ఆరెల్లి భీమయ్య, జిందం ప్రసాద్, పాతూరి రాధ, ఒగ్గు లక్ష్మి, బాల్‌లక్ష్మి, కనకయ్య,బాలయ్య, మహేశ్ ఉన్నారు.

ప్రాణభిక్ష పెట్టండి

- ఆర్థిక సాయం కోసం వేడుకోలు
- పక్షవాతంతో అస్పత్రిలో చేరిన మానస
- చికిత్స కోసం రూ.3 లక్షల ఖర్చు
- పేదరికంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మానస

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్‌లో తలదాచుకుంటున్న ఆ నిరుపేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. ఉన్నట్టుండి భార్య పక్షవాతంతో కాళ్లు, చేతులు పడిపోగా చేతిలో చిల్లిగవ్వ లేక భర్త ఆపన్నహస్తం కోసం వేడుకుంటున్నాడు. మండలకేంద్రానికి చెందిన గౌరిగారి మానస-సతీశ్ దంపతులకు స్థానిక కేసీఆర్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చింది. నిత్యం కూలీ పనులు చేస్తుంటారు. ఈక్రమంలో మానస అనారోగ్యం పాలైంది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా నాలుగు రోజుల్లోనే రూ.60వేల ఖర్చు అయింది. మానసకు పక్షవాతం రావడంతో కాళ్లు, చేతులు పడిపోయాయి. మాట రావడం లేదు. ఖరీదైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు అంటున్నారు. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లలేని పరిస్థితి. దాతలు మానవత దృక్పథంతో స్పందించి ఆర్థిక సహాయం అందించాలని సతీశ్ వేడుకుంటున్నాడు.

ఫోన్‌పే 79938 71392 నంబర్‌లో సాయం అందించాలి

కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలి



కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: బహుజన బాంధవుడు కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషిచేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్‌చౌక్ వద్ద బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 17వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కాన్సీరామ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అంకని భాను, ఎనగందుల వెంకన్న, మునీందర్, రామచంద్రం, పిట్టల భూమేశ్, లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, అంజయ్య, నరేశ్ ఉన్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

- జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు



గుండారంలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తండాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక పేర్కొన్నారు. మండలంలోని రాచర్లగుండారంలో రూ.20 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాకుండా వాటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్, ఎంపీటీసీలు వరద బాబు, ఎలగందుల అనసూయ, నాయకులు అందె సుభాష్, కిషన్, అప్సరా ఉన్నీసా పాల్గొన్నారు.

కులసంఘాలకు భూమి ప్రొసీడింగ్స్



కులసంఘాలకు ప్రొసీడింగ్స్ అందజేత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు, ముదిరాజ్, యాదవ కులసంఘాలకు సోమవారం భూమి ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య చేతులమీదుగా అందించారు. ఒక్కో కులసంఘానికి రెండెకరాల చొప్పున భూమిని ప్రభుత్వం తరఫున కేటాయించినట్లు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఆయా కులసంఘాల ప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేతో బాధితులకు న్యాయం

సిరిసిల్లఅర్బన్: బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు బాధితుల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఎస్‌హెచ్‌వోలకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఇఫ్కో శిక్షణలో పీఏసీఎస్ సీఈవోలు



న్యూఢిల్లీ శిక్షణలో సీఈవోలు

ముస్తాబాద్(సిరిసిల్ల): నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అంశాలపై న్యూఢిల్లీలో ఇఫ్కో ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల శిక్షణకు ముస్తాబాద్, పోతుగల్ సింగిల్‌విండో సీఈవోలు హాజరయ్యారు. సీఈవోల శిక్షణ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పోతుగల్ సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు తెలిపారు. రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. శిక్షణలో సీఈవోలు అనమేని బాలయ్య, కృష్ణ ఉన్నారు.

వైకుంఠరథానికి విరాళాల వెల్లువ



విరాళాలు అందిస్తున్న దాతలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లిలో వైకుంఠరథం కోసం విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. గ్రామానికి చెందిన పలువురు ముందుకురావడంతో ఇప్పటి వరకు రూ.3లక్షల వరకు జమయ్యాయి. వైకుంఠరథంతోపాటు రథానికి నీడ కల్పించేందుకు షెడ్డు సైతం ఏర్పాటు చేసేందుకు విరాళాల సేకరణ కొనసాగుతోంది. పది రోజులుగా గ్రామంలో విరాళాలు సేకరిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతిరోజు విరాళాల వెల్లువ కొనసాగుతూనే ఉంది. బండలింగంపల్లిని మిగతా గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బీసీబంధు అందజేత

వేములవాడ: పట్టణంలోని 21వ వార్డులో బీసీబంధు లబ్ధిదారులు చొప్పదండి రాజేశ్, కోయల్‌కార్ విష్ణులకు కౌన్సిలర్ నరాల శేఖర్ సోమవారం చెక్కులు అందజేశారు. నాయకులు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, మామిండ్ల రాము, చల్లా సత్తయ్య పాల్గొన్నారు.

చీరలు పట్టివేత



వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడరూరల్ మండలం ఎదురుగట్లలో ఓ పార్టీ నాయకుడు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో సోమవారం ఫ్లయింగ్‌స్క్వాడ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడిచేసి పట్టుకున్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో మహిళా సంఘం సభ్యురాలి ద్వారా చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలియడంతో దాడి చేశారు. అప్పటికే పంపిణీ చేసిన 200 చీరల నుంచి 42 చీరలను రికవరీ చేశారు. ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ ఏఈ వెంకట్‌రెడ్డి ఫిర్యాదుతో మారపల్లి కరుణాకర్‌రెడ్డి, పొన్నం మేఘన, పిట్టల కీర్తనలపై కేసు నమోదు చేసినట్లు వేములవాడరూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఈ దాడిలో తహసీల్దార్ సుజాత, సీఐ కృష్ణకుమార్, ఎస్సై మారుతి ఉన్నారు.

సిరిసిల్ల వనరులు దోచుకున్నారు



సిరిసిల్లటౌన్: జిల్లాలోని వనరులను అధికార పార్టీ నేతలు దోచుకున్నారని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఎన్నికల చైర్మన్ కటుకం మృత్యుంజయం ఆరోపించారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం నేర్పాలన్నారు. ఏఐఎఫ్‌బీతోనే సామన్యులకు న్యాయం జరుగుతుందన్నారు. అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులను నిలబెడుతామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్ ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



శివకుమార్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన వేముల శివకుమార్(25) మద్యానికి బానిసై తల్లిదండ్రులు మందలించడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత నెల 30న పురుగుల మందుతాగిన శివకుమార్ పది రోజులపాటు మృత్యువుతో పోరాడి సోమవారం మరణించాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. శివకుమార్ కూలీ పనులు చేస్తుండేవాడు. వచ్చిన డబ్బులను మద్యానికే ఖర్చు చేసేవాడు. ఎన్నిసార్లు తల్లిదండ్రులు మందలించినా మార్పు రాలేదు. తాగి ఇంటికొచ్చి గొడవ పడుతున్న శివకుమార్‌ను గత నెల 30న కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతునికి తల్లిదండ్రులు జమున-గంగయ్య, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భూతగాదాలో దాడి



బింజీనాయక్‌పై దాడి చేస్తున్న ప్రత్యర్థులు



నిందితులను చూపుతున్న పోలీసులు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- దాడిని అడ్డుకున్న పోలీసులు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం రంగంపేట పరిధిలోని ఎర్రగడ్డతండాలో సోమవారం భూతగాదాలో కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు. ఎర్రగడ్డతండాకు చెందిన తండ్రీకొడుకులు బానోత్ బింజీనాయక్, బానోత్ చంద్రకాంత్ తమకు ప్రభుత్వం ఇచ్చిన 4.08 ఎకరాలలో సోమవారం ట్రాక్టర్‌తో చదును చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు వారిపై కర్రలతో దాడి చేశారు. దాడి జరుగుతున్న సమాచారాన్ని డయల్ 100కు తెలపడంతో పోలీసులు వెళ్లి వారిని చెదరగొట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుతో దాడికి పాల్పడ్డ ఎర్రగడ్డతండాకు చెందిన బానోత్ శ్రీనివాస్, బానోత్ మధన్, బానోత్ నరేశ్, మాలోత్ శ్రీనివాస్, బానోత్ సుధాకర్, బానోత్ కెమ్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నవత తెలిపారు. బింజీనాయక్‌కు, బానోత్ శ్రీనివాస్ మధ్య కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయన్నారు. గొడను అడ్డుకోబోయిన పోలీసులపై నిందితులు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేసినట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

15 నుంచి దేవి నవరాత్రోత్సవాలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 15 నుంచి 23 వరకు దేవి నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న మూలానక్షత్రం పుస్తకరూపిణి మహాసరస్వతీ పూజ, 22న దుర్గాష్టమి సందర్భంగా చండీకలశ ప్రతిష్ఠ, చండీహవనం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు మహిశాసురమర్ధని అమ్మవారికి మహాపూజ, అదే రోజు రాత్రి 8.30 గంటలకు ధర్మగుండంలో తెప్పోత్సవం, 23న విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడుదాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



చీకోడులో బీజేపీ నాయకుల ర్యాలీ

ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పాడుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. మండలంలోని చీకోడులో 'మేరా మట్టి మేరీ దేశ్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చీకోడులో సేకరించిన మట్టితో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనమేని చక్రధర్‌రెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, సర్పంచ్ రజిత, మండలాధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు బర్కం లక్ష్మి, సంతోష్‌రెడ్డి, ప్రభాకర్, ఆడెపు ప్రభాకర్, వేణు, అంజాగౌడ్, నరేశ్, శ్రీనివాస్‌రావు, క్రాంతి, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, పూరడి రాజు, వెంకటేశ్, శ్రీకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మండల సాధనకు కొత్తపల్లిలో మహాధర్నా



మహాధర్నాలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. అర్హులకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, దళితబంధు, గృహలక్ష్మీ పథకాలను అందించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో దాదాపు 400 మంది పేదలు ఇళ్లు లేనివారు ఉంటే.. గృహలక్ష్మిలో 17 మాత్రమే మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌటి గణేశ్, పెద్దూరి పర్శరామ్‌గౌడ్, బట్టు ప్రవీణ్, దమ్మ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ జిల్లా నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, మేకర్తి శ్రీనివాస్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన నచ్చకే చేరికలు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్‌లో 30 మంది చేరిక



పార్టీలో చేరిన యువకులతో ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన నచ్చకనే కాంగ్రెస్‌లో భారీగా చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగి మండలంలో 30 మంది యువకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరగా.. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రాబోతుందన్నారు. కేసీఆర్ నియంతృత్వ పాలనతో ప్రజలు పడుతున్న కష్టాలు తీరనున్నాయన్నారు. అధికారంలోకి రాగానే 6 డిక్లరేషన్లు అమలు చేస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు తూము జలపతి, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, నాయకులు పల్లి గంగాధర్, ఎర్రం గంగనర్సయ్య, ధార్న మల్లేశం, గండి నారాయణ పాల్గొన్నారు.

ముస్లిం మహిళల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ముస్లిం మహిళలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మైనారిటీ బంధుతోపాటు కుట్టుమిషన్లు ఇస్తామని పిలిచి ఇవ్వకపోవడంతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై బైఠాయించారు. ముస్లిం మహిళలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీలకు అందిస్తున్న మైనారిటీ బంధు, కుట్టుమిషన్లు తంగళ్లపల్లిలోని మైనారిటీ గురుకుల హాస్టల్ వద్ద పంపిణీ చేస్తామని చెప్పడంతోనే పలు మండలాల నుంచి వచ్చామన్నారు. తీరా పంపిణీ చేయకుండా తాళాలు వేసుకున్నారన్నారు. మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని జిల్లా మైనార్టీ అధికారి సర్వర్‌మియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోగా.. తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు వారితో మాట్లాడి శాంతింపజేశారు.

ప్రేమ విఫలం.. యువతి ఆత్మహత్య

- రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్య

రామగుండం: ఇన్‌స్టాగామ్‌లో పరిచయం యువకుడి, యువతి మధ్య ప్రేమగా మారింది. అయితే, తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో యువకుడు తిరస్కరించాడు. దీంతో మనస్తాపం చెందిన కల్వల శార్వాణి(20) సోమవారం అతివేగంగా వస్తున్న రైలు ఎదుట పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కల్వల ప్రదీప్‌కుమార్ కూతురు శార్వాణికి రెండేళ్ల క్రితం ఏపీలోని తిరుపతికి చెందిన యువకుడు గంగాధర్‌తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. దీంతో రెండేళ్లుగా ఇద్దరూ చాటింగ్ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని గంగాధర్‌ను కోరింది. అయితే, తనకు ఇప్పటికే వివాహమైందని, పెళ్లి చేసుకోవడం కుదరదని ఆ యువకుడు తిరస్కరించాడు. తీవ్రమనస్తాపం చెందిన శార్వాని.. సోమవారం ఆ యువకుడితో ఫోన్‌లో మాట్లాడుకుంటూనే.. రామగుండం రైల్వేస్టేషన్‌లోకి చేరుకుంది. వేగంగా వస్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలును చూసి పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకుంది. శార్వాణి ఎన్టీపీసీలోని హోండా షోరూంలో ఉద్యోగిగా పనిచేస్తోంది. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జి వివరించారు.